ప్రజాశక్తి

శనివారం 14 డిసెంబర్ 2024 | 5 | విజయనగరం

కరాటేలో విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు రాష్ట్ర కెన్యు రియు కరాటే ఛాంపియన్‌షిప్‌లో పతకాలు లభించాయి. కోచ్ శ్రీ సంతోష్ కుమార్ ఆధ్వర్యం లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈనెల 8 నుంచి విశాఖపట్నంలో పోటీల్లో వివిధ విభాగాలలో పతకాలు సాధించారు. పి.హేమంత్ ఎం.హర్ష వర్ధన్, పి.హర్ష వర్ధన్, బి. షణ్ముఖ శ్రీకర్, కె.శివగణేష్, బి.శివ. శ్రీ హర్ష, బి.రేశ్వంత్, కె.స్నేహ, వి.చేతన్ నాయుడు, కార్తీక్, ఎల్. జశ్వంత్, కె.మోహన్ చంద్ర, ఆర్.గణేష్, వి.చేతన్ ఆనంద్ సుహాస్, బి.భార్గవ్‌కు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సత్య కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయిదేవ మణి, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్‌హెచ్ హెచ్. ప్రసాద్. పతకాలు సాధించిన వారిని అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

విద్యుత్తు శాఖలో అవినీతి తీగలు

విజిలెన్స్ కళ్లకు గంతలు

విద్యుత్తుశాఖలో అవినీతి తీగలు పెరిగిపోతున్నాయి. నగర శివార్లలోను, అనధికార లే అవుట్లలోనూ అక్రమంగా విద్యుత్తు లైన్లు వేసేందుకు వినియోగదారుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి దిగమింగుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. విద్యుత్తు లైన్ల ఏర్పాటు కోసం వినియోగదారులు ఇస్తున్న మొత్తాన్ని తమ జేబులో వేసుకుంటూ.. ప్రభుత్వ ఖజానాకు కన్నంపెడుతూ అక్రమంగా విద్యుత్తు స్తంభాలు, వైర్లు వేయడం తాజాగా వెలుగు చూసింది. విజయనగరం నడిబొడ్డున ప్రదీప్‌నగర్ సమీపంలోని సత్యసాయి లే అవుట్‌లో ఇలా వేసిన అక్రమ కనెక్షన్ల విషయమై ఓ వ్యక్తి ఫిర్యాదుతో సర్దుకున్న ఎఇలు ఈ అవినీతి బయట పడకుండా ఉండేందుకు విజిలెన్సు కళ్లు కప్పేసి క్షణాల్లో స్తంభాలను మాయం చేసి, తనిఖీల అనంతరం మళ్లీ స్తంభాలు వేసిన ఘటన చోటు చేసుకుంది. సినీఫక్కీలో జరిగిన ఈఘటనను ప్రశ్నించిన ఓ వ్యక్తిపై కాంట్రాక్టర్ దౌర్జన్యం చేయడంతో ఈ విషయం బట్టబయలైంది.

విజిలెన్స్ అధికారులు తనిఖీకి వస్తున్నారని తెలియడంతో స్తంభాలను తొలగిస్తున్న సిబ్బంది

తొలగించిన స్తంభాలను గాయత్రీనగర్ మార్గంలో దాచి ఉంచిన సిబ్బంది

విజిలెన్స్ తనిఖీలు పూర్తయ్యాక మళ్లీ ఏర్పాటు చేసిన స్తంభాలు

- ప్రభుత్వ ఖజానాకు కన్నం పెడుతున్న ఎఇలు
- లంచాలతో అక్రమంగా కనెక్షన్లు ఏర్పాటు
- ఓ వ్యక్తి ఫిర్యాదుతో స్తంభాలు తొలగించిన అధికారులు
- ఇదేమిటని అడిగిన వ్యక్తిపై కాంట్రాక్టరు దౌర్జన్యం
- విజిలెన్సు విచారణ అనంతరం యథావిధిగా ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/టౌన్

నగరంలోని ప్రదీప్‌నగర్ పరిధిలోని సత్యసాయి లే అవుట్‌లో ఓ బ్యాంకు ఉద్యోగి నగరపాలక సంస్థ నుంచి అన్ని అనుమతులూ తీసుకొని మూడంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ స్థలం విజయనగరం డి4 సెక్షన్ అయ్యన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉంది. అయితే ఆ భవన యజమానికి అవగాహన లేకపోవడంతో ఆ ఇంటికి విద్యుత్తు లైన్ కోసం డి3 సెక్షన్ విటిఅగ్రహారం సబ్ స్టేషన్ ఎఇని ఆశ్రయించారు. వేరేచోట ఉన్న 11కెవి లైన్ నుంచి ఆ భవనానికి కనెక్షన్ ఇచ్చేందుకు 5స్తంభాలతో పాటు 11 కెవి లైన్ వేయాల్సి ఉంది. ఇందుకు రూ.3లక్షలు వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇందుకు సంబంధించి ఎస్టిమేషన్ వేసి ఎపిఇపిడిసిఎల్ పేరున డిడి తీయాల్సి ఉంది. ఆ నిర్మాణం తన పరిధిలో లేనప్పటికీ సదరు ఎఇ ఆ ఇంటి యజమాని వద్ద అధిక మొత్తంలో (లక్షల రూపాయలు) డబ్బులు తీసుకొని, ఎపిఇపిడిసిఎల్‌కు డబ్బులు చెల్లించకుండా ఆ ఇంటికి మూడు నెలల క్రితం ఐదు విద్యుత్తు సంభాలతో పాటు 11కెవి విద్యుత్తు లైన్‌ను అక్రమంగా వేశారు. అలాగే పక్కనే ఉన్న పైడిమాంబ అక్రమ లేఅవుట్ యాజమాని నుంచి కూడా భారీ మొత్తంలో లంచం తీసుకొని విద్యుత్తు స్తంభాలు, లైన్లు వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పలువురు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

అధికారుల వద్ద పంచాయితీ ?

డి3, డి4 సెక్షన్ల మధ్య సరిహద్దు వివాదం నేపథ్యంలోనే ఇదంత బయటకు వచ్చిందనే అనుమానంతో ఆయా సెక్షన్ల ఎఇలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నట్లు తెలిసింది. డి4 పరిధిలో ఉన్న స్థలంలో ఎలా విద్యుత్తు స్తంభాలు వేస్తారని డి3 ఎఇని ప్రశ్నించినట్లు తెలిసింది. ఇలా ఇద్దరి మధ్య వివాదం నెలకొనడంతో చివరకు అధికారులు వారిని పిలిచి సయోధ్య కుదిర్చినట్లు తెలిసింది. ఆ తరువాతే డి3 ఎఇ ఎపిఇపిడిసిఎల్‌కు డబ్బులు కట్టి హుటాహుటిన రెండు రోజుల క్రితం ఆ భవనానికి విద్యుత్తు లైన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

విజిలెన్స్ అధికారులు వస్తున్నారని..

అక్రమ లేఅవుట్లకు అంచాలు తీసుకొని లైన్లు వేస్తున్నట్లు ఓ వ్యక్తి విజిలెన్సు అధికారులకు ఇచ్చిన ఫిర్యాదుతో జిల్లా విద్యుత్తుశాఖ అధికారులు అప్రమత్తమ య్యారు. గతనెల 27న విజిలెన్సు అధికారులు తనిఖీకి వస్తారని తెలుసుకున్న డి3 సెక్షన్ ఎఇ విద్యుత్తు పనుల కాంట్రాక్టర్ చిన్నాకు చెప్పి అదేరోజు ఉదయం 6గంటలకే ఆ విద్యుత్తు స్తంభాలను, వైర్లను పీకించేసి వాటిని గాయత్రీనగర్ మార్గంలో దాచేసి విజిలెన్సు అధికారుల కళ్లకు గంతలు కట్టేశారు. ఉదయం పూట వాకింగ్ చేస్తున్న ఓ వ్యక్తి వారిని స్తంభాలు ఎందుకు తీసేస్తున్నారని ప్రశ్నించి ఫొటోలు తీశారు. దీంతో ఆయనపై కాంట్రాక్టర్ చిన్నతో పాటు కూలీలు దౌర్జన్యం చేసి, ఆయన వద్ద సెల్‌ఫోన్ తీసుకొని కొట్టేందుకు ప్రయత్నించారు. ఫోన్‌లో ఉన్న ఫొటోలను తొలగించారు. ఆ ప్రాంతానికి పరిశీలన నిమిత్తం ఉదయం 10గంటలకు వచ్చిన విజిలెన్సు అధికారులు అక్కడ విద్యుత్తు స్తంభాలు, వైర్లు లేకపోవడంతో అక్రమ లైన్లు ఏమీ లేవని రాసుకొని వెళ్లిపోయారు. ఆ మరుచటి రోజు విద్యుత్తు శాఖ సిబ్బంది వచ్చి మూడుస్తంభాలు వేసి వదిలేశారు. ఆ భవన యజమాని ఒత్తిడితో మరో వారం రోజులు తరువాత ఆ ఇంటి వరకు స్తంభాలు, లైన్లు వేసేందుకు ఎస్టిమేషన్ వేసి సుమారు రూ.2.70లక్షలు ఎపిఇపిడిసిఎల్‌కు ఎఇ ఆ మొత్తాన్ని చెల్లించి రెండు రోజుల క్రితం లైన్లు వేశారు. ట్రాన్స్‌ఫారం కూడా వేసి ఆ ఇంటికి విద్యుత్తు వెలుగులు ప్రసాదించారు.

ఎటువంటి అక్రమాలూ జరగలేదు

సత్యసాయి లే అవుట్‌లో ఎటువంటి అక్రమ లైన్లూ తమ సిబ్బంది వేయలేదు. ఆ లేఅవుట్ డి3లో కొంత, డి4 పరిధిలో కొంత ఉంటుంది. ఓ భవనానికి వేసిన స్తంభాల సైజుల్లో తేడా ఉండడంతో కాంట్రాక్టర్‌కు చెప్పి మార్పించాం. 9.5 స్పన్‌కు బదులు 8.5 స్పన్ సైజు వేయడంతో ఈ సమస్య వచ్చింది. అంతే తప్ప అక్రమాలేమీ జరగలేదు. అలా జరగడానికి ఆస్కారం లేదు.

- కిరణ్‌కుమార్, ఎడిఇ, విజయనగరం

నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

398 సంఘాలు.. 3.12 లక్షల మంది ఓటర్లు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. శనివారం అన్ని కమిటీలకు ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సంఘాల అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోనున్నారు. జిల్లాలోని ఏకైక డిస్టిబ్యూటరీ (వంగర మండలం రాజుల గుమడ) కమిటీ ఎన్నిక మాత్రం ఈ నెల 17న జరుగనుందని జలవనరులశాఖ డిఇ గోవిందరావు తెలిపారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు తలెత్తకుండా వీలైనంత ఏకగ్రీవం చేసేందుకు జలవనరులశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

జిల్లాలో 398 నీటి సంఘాలు ఉండగా సభ్యులు 2680 మంది సభ్యులు, 3లక్షల 12,029 మంది ఓటర్లు ఉన్నారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 345 నీటి సంఘాలు ఉండగా, వీటిలో 2070 మంది సభ్యులు, ఓటర్లు లక్షా 90వేల 583 మంది ఓటర్లు ఉన్నారు. మీడియం ఇరింగేషన్‌లో 46 నీటి సంఘాలు ఉండగా సభ్యులు 538 మంది, ఓటర్లు లక్షా 6వేల 740 మంది ఉన్నారు. భారీ ఇరిగేషన్‌లో ఏడు సంఘాల్లో 84 మంది సభ్యులు, 14,706 మంది ఓటర్లు ఉన్నారు.

9 ఏళ్ల తరువాత నిర్వహణ

సాగునీటి సంఘాలకు సుమారు 9ఏళ్ల తరువాత ఎన్నికలు జరుగుతున్నాయి. ఆయకట్టు పరిరక్షణ, సాగు, నీటి సరఫరా



సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు పూర్తి అవగాహన ఉంటుంది. వారే సభ్యులుగా ఉన్న కమిటీలు అందుబాటులోకి వస్తే మేలు జరుగుతుందని భావిస్తున్నారు. వివాదాల పరిష్కారానికి ఆస్కారం ఏర్పడుతుంది.

ఓటర్లంతా ఐడి కార్డులతో హాజరు కావాలి

ఓటర్లంతా తమ ఐడి ప్రూఫ్‌తో ఉదయం 9 గంటల లోపు హాజరు కావాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. జిల్లాలో మొత్తం 395 నీటి సంఘాలకు, శ్రీకాకుళం జిల్లా పరిధిలోని జి సిగడాం పరిధిలోని 3 సంఘాలకు తమ ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లయిన రైతులు ఉదయం 8 నుండి 9 గంటల లోపు ఓటు వేసే పాఠశాల వద్దకు చేరుకోవాలని, ఓటర్లంతా తమ ఆధార్ కార్డు తో పాటు పాస్ బుక్ లేదా 1బి పుస్తకం ఏదో ఒకటి ఐ.డి ప్రూఫ్ గా తీసుకు వెళ్లాలని తెలిపారు. ఎన్నిక పూర్తయ్యే వరకు పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్మికులు

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన • 17న విద్యుత్తు బిల్లుల దహనానికి పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలతో పాటు అదానితో విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన కోట జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న విద్యుత్తు బిల్లులను దగ్ధం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నేడు అదానికి అమ్ముడు పోయి విద్యుత్తు ట్రూ అప్‌ఛార్జీల పేరిట రూ.16800కోట్లు భారాలు ప్రజలపై వేశారన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపువల్ల ఎన్‌టిఆర్ ఆత్మ శోభిస్తుందని, తక్షణమే ఛార్జీల భారాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాలూరి రమణమ్మ, నగర కమిటీ సభ్య బి. రమణ, వి.రామచంద్ర రావు, రంభ శ్రీనివాసరావు, ఎం.శాంతమూర్తి, రాకోటి ఆనంద్, వెంకటరావు, ఆటో యూనియన్ నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వాములవుదాం

జెసి సేతు మాధవన్ • 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల ప్రత్యక్ష ప్రసారం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రతిజ్ఞ చేస్తున్న జెసి సేతు మాధవన్, డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల కార్యక్రమం విజయవాడలో శుక్రవారం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఇతర జిల్లా ఉన్నతాధికారులు వీక్షించారు. స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరం భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు.

ఢిల్లీ ఐఐటి, సిటియు ఆధ్వర్యాన వర్క్‌షాప్

విజయనగరంటౌన్ : ఢిల్లీ ఐఐటి సహకారంతో సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ, ఒఅర్‌సిఐజిపిఎఫ్ సంయుక్తంగా రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించింది. వైస్-ఛాన్సలర్ టివి కట్టిమణి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమం లో మాట్లాడుతూ పరిశోధన, అకాడమిక్ ఓపెన్-యాక్సెస్ పబ్లిషింగ్ ప్రాముఖ్యత వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ విధానాన్ని స్వీకరించడం ద్వారా, పరిశోధకులు తమ పరిశోధనల వ్యాప్తిని విస్తృతం చేయవచ్చునని అన్నారు. వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్లుగా ఐఐటికి చెందిన డాక్టర్ నబీ హసన్, హెడ్ లైబ్రేరియన్ డాక్టర్ మోహిత్ గార్గ్ మాట్లాడుతూ యునెస్కో పబ్లిషింగ్ ఎథిక్స్, ఓపెన్ యాక్సెస్ మోడల్స్, ఓపెన్ పబ్లిక్ లైసెన్సింగ్, ఓపెన్-యాక్సెస్ పబ్లిషింగ్‌లో నైతిక ప్రమాణాలును వివరించారు.

రైతు సమస్యలపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్నదాతల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైపిసి ఆధ్వర్యాన రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. కంటోన్మెంట్ మున్సిపల్ పార్కు నుంచి కలెక్టరేట్ వరకూ రైతులతో కలిసి వైసిపి నాయకులు ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రైతు సమస్యలు పరిష్కరించి అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పిన టిడిపి ప్రభుత్వం నేడు రైతులకు నష్టపరిహారం చెల్లించడంలోను, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలోను, ప్రోత్సాహం అందించడంలోనూ విఫలమైంద న్నారు. తక్షణమే రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలు అపాలన్నారు. అనంతరం అన్నదాతల సమస్యలను పరిష్కరి ంచాలని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పల నాయుడు, శంబంగి వెంకట చిన్న అప్పల నాయుడు, కడుబండి శ్రీనివాసరావు, శోభా హైమావతి, రాజాం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ తలే రాజేష్ తలే, జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతి రాణి, విజయనగరం మేయర్ వి.విజయలక్ష్మి, కొప్పల వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు, డిసిసిబి మాజీ చైర్మన్ వి.చినరామునాయుడు, వైసపి అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు ర్యాలీ చేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

వైసిపివి ఆకలు కేకలు

ఎమ్మెల్యే కళావెంకటరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

అధికారం లేకపోవడంతో ఆరు మాసాలు ఆగలేక, ఇంటిలో ఉండ లేక వీధుల్లోకి వచ్చి వైసిపి నాయకులు ఆకలి కేకలు వేస్తున్నారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం చీపురుపల్లిలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి హయాంలో రైతుల పంటను ఆ మిల్లుకు, ఈ మిల్లుకు తీసుకెళ్లండని తిప్పడంతోపాటు క్వింటాకు 5 నుండి 10 కిలోల వరకు ధాన్యం అదనంగా తీసుకున్నారని తెలిపారు. నేడు ఆ పరిస్థితి లేదని, రైతులు పండించిన పంటను వారి ఇష్టమొచ్చిన చోట అమ్ముకునేలా ప్రభుత్వం కార్యాచరణ చేసిందన్నారు. ధాన్యం ఇచ్చిన మరుసటి రోజే రైతులకు డబ్బులు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో ఆ పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు ఐదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు కనీసం రూ.5 కోట్లు అయినా ఇరిగేషన్ గురించి తెచ్చారా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతుల పట్ల మొసలి కన్నీరు ఆపి ప్రభుత్వానికి మంచి సూచనలు, సలహాలు ఇస్తే బాగుంటుందని వైసిపి నాయకులకు హితవుపలికారు. సమావేశంలో టిడిపి నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్, బలగం వెంకటరావు, రౌతు కామునాయుడు, కరణం మురళి, జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గణేష్ జ్యూట్‌మిల్లును తెరవాలి

గేటు వద్ద కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జ్యూట్‌మిల్లు గేటు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

చిన్నాపురంలోగల గణేష్ జ్యూట్ మిల్లును బేషరత్‌గా తెరవాలని కోరుతూ జ్యూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చేందుకు ప్రయత్నించారు. యూనియన్‌తో తాము మాట్లాడబోమని, వినతి పత్రం కూడా తీసుకునేందుకు యాజమాన్యం నిరాకరించడంతో ఆగ్రహించిన కార్మికులు మిల్లు గేటుకు వినతి పత్రాన్ని అతికించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ .జగన్మోహన్‌రావు మాట్లాడుతూ కార్మికులు పనిచేసిన కాలానికి జీతం చెల్లించకుండా అక్టోబర్ 12 నుంచి యాజమాన్యం మిల్లును మూసి వేసిందని, మిల్లు తెరవాలంటే బదిలీ కార్మికులంతా రాజీనామా చేసి ఎన్‌ఎంఆర్‌లుగా రావాలని నోటీసు బోర్డులో పెట్టడం కార్మిక హక్కులను కాలరాయడమేనని అన్నారు. బేషరతుగా మిల్లు తెరవాలని, జీతం ఇవ్వాలని, పిఎఫ్, డిఎబకాయిలు చెల్లించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నిస్తే తీసుకునేందుకు యాజమాన్యం నిరాకరించడం దుర్మార్గమన్నారు. తక్షణమే కార్మిక శాఖ అధికారులు స్పందించి జ్యూట్ మిల్లు తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతున్నామని తెలిపారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో యూనియన్ నాయకులు కె.అప్పలనాయుడు, అప్పలరాజు, సూర్యనారాయణ, కిరణ్, రామకృష్ణ, దేవుడు, సత్యనారాయణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు .

15న గురజాడ యువ చైతన్యోత్సవం

విజయనగరం కోట : గురజాడ ఫౌండేషన్ (అమెరికా, భారత్) , గిడుగు రామ్మూర్తి తెలుగు భాష జానపద కళా పీఠం సంయుక్త ఆధ్వర్యంలో యువ చైతన్య దినోత్సవం విజయనగరం గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని సదస్సు సమన్వయకర్త ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కొవ్వలి గోపాలకృష్ణ సంపాదకత్వంలో మహా కవిత ఖండికలు, మీ పేరేమిటి?, గురజాడ ఇతర కథలు, ప్రకాశిక పుస్తకములు ఆవిష్కరిస్తామని తెలిపారు. గురజాడ రచనల్లో స్ఫూర్తిని నేటి విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బద్రికూర్మారావు తెలిపారు.

సినీ ఫక్కీలో రూ.40 లక్షల గంజాయి పట్టివేత

- అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు
- బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రామభద్రపురం

కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద సుమారు రూ.40.50 లక్షల విలువైన 810 కిలోల గంజాయి పట్టుబడిందని బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు వెల్లడించారు. శుక్రవారం రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, ఎస్‌ఐ ప్రసాదరావుతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పట్టుబడ్డ గంజాయి వివరాలను డిఎస్‌పి తెలిపారు. డిఎస్‌పి కథనం ప్రకారం..

మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇండోర్‌కు లారీ, రెండు బొలెరో వాహనాల్లో 27 బస్తాల్లో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం వచ్చింది. వీరు అంచలంచెలుగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ముందుగా వేరే వాహనాల్లో ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చారు. మన రాష్ట్రంలో ప్రవేశించాక గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో బొగ్గు బస్తాలతో వస్తున్న లారీలోకి గంజాయి మార్చి, తరలించేందుకు సిద్ధం చేసుకున్నారు. సినీ ఫక్కీలో బుధవారం రాత్రి నుంచి బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు ఆధ్వర్యాన వారిని ట్రాక్ చేశారు. టెక్నికల్ సపోర్టుతో రామభద్రపురం పోలీసులు మాటువేసి ఈ ముఠా గుట్టురట్టు చేశారు. కొట్టక్కి చెక్‌పోస్ట్ వద్ద మొదట బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తుండగా, అందులో 30 కిలోల గంజాయి పట్టుబడింది. వెంటనే అందులో ఉన్న వ్యక్తులు పారిపోవడంతో వెనుక వస్తున్న మరో బొలెరో వాహనాన్ని, వీటినే అనుసరిస్తూ వస్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. బొగ్గు మూటల మధ్య గంజాయి బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. 27 బస్తాల్లో 810 కిలోల గంజాయి పట్టుబడింది. దీనివిలువ సుమారు రూ.40.50 లక్షల వరకు ఉంటుందని డిఎస్‌పి తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ హుకుం సోలంకి, క్లీనర్‌గా వ్యవహరిస్తున్న ఆయన కుమారుడు అనిల్ సోలంకి, కోరాపుట్‌కు చెందిన బొలెరో డ్రైవర్ జ్యోతి బూసన్ బెహరాను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వీరిని మధ్యవర్తుల సమక్షంలో విచారించగా కోరాపుట్‌కు చెందిన సుబ్లం అదికాటియా, దిలీప్ దుసర బారిక్, ప్రశాంత్ అదికాటియా.. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి ఇక్కడ అందిస్తున్నట్లు చెప్పారన్నారు. లారీలో బొగ్గు గంగవరం నుంచి తెస్తున్నట్లు నమోదు కాగా, ఇక్కడ నుంచి గంజాయి అక్రమ రవాణాకు వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

నంబర్ ప్లేట్‌పై 'పోలీస్'

గంజాయి ముఠా వేర్వేరు నంబర్ ప్లేట్లు మార్చుకొని వస్తున్నట్లు, అందులో పోలీస్ అనే బోర్డు కూడా ఉన్నట్లు డిఎస్‌పి వెల్లడించారు. ఈ ముఠాది పెద్ద నెట్‌వర్క్ అని, ఈ రవాణాలో పెద్ద వ్యక్తులు కూడా ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. గంజాయి ముఠా గుట్టురట్టు చేయడంలో సాంకేతిక సహాయంతో కీలకపాత్ర పోషించిన రూరల్ సిఐ నారాయణరావు, గంజాయి పట్టుకున్న కానిస్టేబుల్ విష్ణును అభినందించారు. నిందితులను సాలూరు కోర్టులో హాజరుపరచగా, వారికి జడ్జి రిమాండ్ విధించారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, వాహనాల నంబర్ ప్లేట్లు

కొండయ్యకు గద్దర్ పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

కొండయ్యకు గద్దర్ పురస్కారం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు గ్రామానికి చెందిన ప్రజాకళాకారుడు టి.కొండయ్యకు గద్దర్ జాతీయ పురస్కారం లభించింది. కోనసీమ జిల్లా పి.గన్నవరంలో మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యాన తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ... ఆయనకు అవార్డును అందజేశారు. దీంతో కొండయ్యకు వావిలపాడు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

కూటమి ప్రభుత్వానివి మాటలే : కాంగ్రెస్

ప్రజాశక్తి-బొబ్బిలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు దాటినా పట్టణంలో రోడ్లపై గుంతలు పూడుస్తామని చెప్పడమే తప్ప పూడ్చే దిశగా పనులు లేవని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఆక్షేపించారు. సంక్రాంతిలోగా మున్సిపాలిటీలో రోడ్లపై గుంతలు కప్పాలని డిమాండ్‌చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందని ద్రాక్షలా ఊరిస్తూ ఉన్నాయని చెప్పారు. ప్రజలను నిలువునా ముంచి ఊపిరి ఆడకుండా చేసేలా విద్యుత్తు ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలను పెంచి పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. పెంచిన విద్యుత్తు ఛార్జీలు రద్దుచేయాలని, నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

గ్రామాల్లో ప్రశాంతతకు ఎంఎస్‌పిలే కీలకం

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు మహిళా సంరక్షణ పోలీసులే కీలకం కావాలని డిఎస్‌పి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్లో శుక్రవారం ఆయన మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్య వినియోగం, రవాణాపై దృష్టిసారించాలన్నారు. మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు జరగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుడ్, బ్యాడ్‌టచ్‌లపై విద్యార్థినులకు వివరించాలన్నారు. అపరిచిత వ్యక్తుల సంచారం, కదలికలపై సమాచారాన్ని సంబధిత పోలీస్ స్టేషన్లో తెలియజేయాలని సూచించారు.

వాలంటీర్లపై రాజకీయ కక్షలు దుర్మార్గం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చెరవేయడంలో పారదర్శకంగా సేవలందించిన వాలంటీర్లపై రాజకీయ కక్షలు దుర్మార్గపు చర్య అని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విజయనగరంలో ఎ.పి గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్స్ యూనియన్ అధర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కె.స్వర్ణ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

తడి, పొడి చెత్తపై మరింత అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తడి చెత్త పొడి చెత్త వర్గీకరణ పై ప్రజలలో మరింత అవగాహన, చైతన్యం తీసుకురావాలని ప్రజారోగ్య సిబ్బందికి విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. చాలామంది చెత్త లను ఒకే బుట్టలో వేసి ఇవ్వడాన్ని గమనించామన్నారు. కాబట్టి ప్రజారోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి రెండు బుట్టల విధానం గురించి వివరించాలని స్పష్టం చేశారు. అలాగే ప్రధాన రహదారులతో పాటు వీధులలో కూడా చెత్తలు తరలించేందుకు మరింత వెసులుబాటు కోసమై ఈమధ్యనే వీల్ బోరోస్ అందించడం జరిగిందన్నారు. వాటి ద్వారా సేకరించిన చెత్తను భారీ వాహనాల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నామని చెప్పారు. ప్రజలు వ్యాపారస్తులు మరింత చైతన్యవంతులై రెండు బుట్టల విధానాన్ని అలవర్చుకోవాలని తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎస్‌ఎఫ్‌ఐ బొబ్బిలి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌ఎస్‌ఎస్. డిగ్రీ కళాశాలలో మండల మహాసభ నిర్వహించారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బి.కిరణ్, కె.శివతోపాటు మరో 17మంది సభ్యులను ఎన్నుకున్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ పనిచేయాలని జిల్లా అధ్యక్షులు డి.రాము కోరారు. ఈ నెల 21, 22న గజపతినగరంలో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మణికుమార్ పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'కు నడుం బిగించాలి

ప్రజాశక్తి -డెంకాడ

మాట్లాడుతున్న అజిత్ కుమార్

వికసిత్ భారత్ కోసం విద్యార్థులు నడుం బిగించాలని ఢిల్లీకి చెందిన విశ్వధర్మ మిషన్ చైర్మన్ ప్రొఫెసర్ అజిత్ కుమార్ కోరారు. స్థానిక లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వికసిత్ భారత్‌పై శుక్రవారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ రంగాల్లో జాతి ఉన్నతిని వివరించారు. కోస్టల్ కారిడాల్ అభివృద్ధి, స్పీడ్ రైల్వే, ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం వంటివి ప్రస్తావిస్తూ నూతన భారతావని నిర్మాణం కోసం విద్యార్థిలోకం విషయ పరిజ్ఞానంతో ఇంజినీరింగ్ విద్యనభ్యసించాలని సూచించారు. కళాశాల చైర్మన్ పి.మధుసూదన్, ప్రిన్సిపల్ వివి రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ హరిబాబు, డిపార్ట్‌మెంట్ హెడ్ పి.దుర్గ శైలజ, ఎన్ఎస్ఎస్ పిఒ రవితేజ పాల్గొన్నారు.



రామకృష్ణను సన్మానిస్తున్న నిర్వాహకులు

న్యాయవాది రామకృష్ణకు సన్మానం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయంలో జాతీయ గిరిజన సమ్మేళనం ముగింపు ఉత్సవాల్లో శృంగవరపుకోటకు చెందిన పర్యావరణవేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణను శుక్రవారం ఘనంగా సత్కరించారు. రెండు దశాబ్దాలుగా పర్యావరణ, ఆరోగ్య రంగాల్లో జియో, సిమ్ స్వచ్ఛంద సంస్థల ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో చేస్తున్న సేవలను కొనియాడారు.

అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రెండో రోజు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సమన్వయంతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలన్నారు. అనంతరం సర్పంచులు, కార్యదర్శులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శంకర జగన్నాథం, ఎఒ పి.సుదర్శన్ పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఎంకెఆర్‌పురం, వేపాడలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, చినగుడిపాల ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాలభాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

వృక్ష సంపద కంటే డబ్బు సంపాదనే ముఖ్యం

- బొబ్బిలి నుంచి ఇతర రాష్ట్రాలకు కలప అక్రమ రవాణా
- రాయగడలో బొబ్బిలికి చెందిన ముగ్గురు అరెస్టు
- మామూళ్ల మత్తులో అటవీశాఖ అధికారులు

రాత్రి సమయంలో ట్రాక్టర్‌పై తరలిస్తున్న టేకు కలప

ప్రజాశక్తి-బొబ్బిలి

అక్రమ కలప రవాణాను అడ్డుకుని వృక్ష సంపదను కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునుగుతున్నారు. కలప వ్యాపారుల నుంచి అటవీ శాఖ అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడటంతో విలువైన కలపను కొల్లగొడుతున్నారు. ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా చెట్లు కొట్టి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. టేకు, వేప, పాచి, ఇరిడి వంటి విలువైన కలప ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు అక్రమ మార్గంలో తరలించుకుపోతున్నారు.

ఇటీవల కాలంలో బొబ్బిలి ప్రాంతం నుంచి కలప అక్రమ రవాణా అధికమైంది. అటవీశాఖ అధికారులకు మామూళ్లు ఇచ్చి వ్యాపారులు దర్జాగా విలువైన కలపను తరలిస్తున్నారు. కలప వ్యాపారులు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండానే చెట్లు కొడుతున్నారు. వాటిని చీకటి పడిన తర్వాత ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రాత్రయితే చాలు, రాయగడకు కలపతో ట్రాక్టర్లు క్యూ కడుతున్నాయి. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా చెట్లు కొట్టి, పచ్చదనాన్ని, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకుండానే..

బొబ్బిలి నుంచి రాయగడ రాష్ట్రానికి, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు ఎటువంటి అనుమతులు లేకుండా టేకు, వేప, చింత, ఇరిడి, పాచి కలప తరలిస్తున్నారు. విలువైన కలప ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు తరలిస్తున్నట్లు అటవీశాఖ అధికారులకు తెలిసినప్పటికీ వ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకుని, చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ నెల 8న బొబ్బిలి నుంచి టేకు కలపను వ్యానులో ప్రభుత్వ అనుమతులు లేకుండా తరలించారు. రాయగడ సమీపంలో ఒడిశా అటవీశాఖ అధికారులు పట్టుకుని, కలపతోపాటు వ్యాన్‌ను సీజ్ చేశారు. లోడింగ్‌కు వెళ్లిన ఇద్దరు కూలీలతోపాటు వ్యాను డ్రైవర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బొబ్బిలి నుంచి తరచూ ఒడిశాకు కలప తరలిస్తున్నట్లు తెలిసింది.

జీవనోపాధి కోసం వెళ్లి..

కలప అక్రమ రవాణా కేసులో రాయగడ అటవీశాఖ అధికారులు.. లోడింగ్‌కు వెళ్లిన ఇద్దరు కూలీలు, వ్యాన్ డ్రైవర్‌ను అరెస్టు చేశారు. కుటుంబ జీవనం కోసం కలప వ్యాపారి వద్దకు పనికి వెళ్లిన ఇద్దరు కూలీలు అరెస్టు కావడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరు పెడుతున్నారు. అక్రమ కలప వ్యాపారంలో లాభాలు ఆర్జిస్తున్న వ్యాపారులు సురక్షితంగా ఉంటూ, కూలీలు బలైపోతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా చెట్లు కొడుతున్న వ్యాపారులపై, వ్యాపారులకు సహకరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, కలప అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

16న కలెక్టరేట్ వద్ద స్కూల్ ఆయాల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి వేతనాలు చెల్లించాలని, ఫుల్ టైం వర్కర్లుగా గుర్తించి రూ.12 వేలు వేతనం ఇవ్వాలని కోరుతూ ఎపి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈనెల 16న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా చేయనున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె బేగం, వై.నందిని పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం స్థానిక కస్పా హైస్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలల్లో బాత్రూములు, మరుగుదొడ్ల, తరగతి గదుల పరిశుభ్రత తో పాటు పిల్లలను కంట్రోల్‌లో పెట్టడం ,స్టడీ అవర్స్ లో పాల్గొనటం, మంచినీరు అందించడం వంటి పనులు చేస్తూ రోజంతా స్కూల్లోనే ఉంటున్నామని, ప్రభుత్వం ఇచ్చే రూ.6వేలులు కూడా నెలల తరబడి ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. పని భద్రత కల్పించాలని, కనీసం నెలలో రెండు రోజులైనా సిక్ లీవులు మంజూరు చేయాలని కోరారు. ధర్నాలో స్కూల్ ఆయాలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వేతన బకాయిలు ఇవ్వాలని ధర్నా

డెంకాడ : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మేన్లకు ఐదు నెలలు బకాయిలు వెంటనే చెల్లించాలని స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన ధర్నాచేశారు. అనంతరం ఎంఇఒ శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లకు ఈ ఏడాది జులై నుంచి వేతన బకాయిలు ఉన్నాయని తెలిపారు. 300 మంది విద్యార్థులకు ఒకే ఆయా ఉండడంతో పని భారం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, దత్తి లక్ష్మి, కుమారి, పి.లక్ష్మి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-డెంకాడ

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. అనంతరం ఎంఇఒ శ్రీరాములుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండిఎం కార్మికులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి 20 రూపాయలు మెస్‌ఛార్జీ అందించాలని డిమాండ్‌చేశారు. బకాయిలు ఉన్న బిల్లులు జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, ఎండిఎం కార్మికులు ఈశ్వరమ్మ, ఎం.కృష్ణవేణి, పి.నారాయణమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజిలెన్స్ డిజి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ప్రాంతీయ నిఘా అమలు అధికారి బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా పాతకుంకాం గ్రామం, విజయనగరం జిల్లా కర్లాం గ్రామంలో పలు ఎరువుల దుఖాణాలలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సంబంధిత దుకాణాలలో సరుకు వ్యత్యాసాలు, కాలం చెల్లిన పురుగు మందులు అమ్మకం వంటి అవకతవకలు గుర్తించడంతో సంబందిత దుకాణాలలో రూ. 9,59,098 విలువ కలిగిన 70.545 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి దుఖాణాదారులపై 6(ఎ) కేసులు నమోదు చేశారు. పై తనిఖీలలో నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరుగుతున్న పురుగు మందులను గుర్తించి కేసులు నమోదుచేశారు. తనిఖీలలో విజిలెన్స్ అధికారులు మరియు సంబందిత మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్‌పి బి.ప్రసాదరావు మాట్లాడుతూ ఎరువుల అక్రమ వ్యాపారం పై నిఘా ఉంచామని, తనిఖీలలో పట్టుబడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐదో రోజుకు అంగన్‌వాడీ దీక్షలు

తొలగించిన ఆయాను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దీక్షా శిబిరంలో పాల్గొన్న అంగన్వాడీలు, నాయకులు

గజపతినగరం ప్రాజెక్టు పరిధి రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో అక్రమంగా తొలగించిన అంగన్వాడీ హెల్పర్ మానాపురం సౌజన్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలేనిరాహార దీక్షలు శుక్రవారానికి ఐదోరోజు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ సౌ జన్యకు ఉద్యోగం వచ్చేవరకు పోరాటం కొనసాగించాలని, మంత్రులిద్దరూ తక్షణమే స్పందించి ఉద్యోగం ఇప్పించే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగం ఇచ్చేటప్పుడు సమర్పించిన సర్టిఫికెట్లను సమగ్రంగా పరిశీలించిన తర్వాతనే ఉద్యోగం ఇవ్వడం అనేది ఐసిడిఎస్ సంస్థలలో జరిగిన ప్రక్రియని, రెండేళ్ల తరువాత సర్టిఫికెట్లు తప్పులని చెప్పడం అన్యాయమని అన్నారు. దీక్షలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సూర్యనారాయణ, ఎం.వరం, జి.హరిప్రియ, సిహెచ్ చిన్నమ్మలు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే కళావెంకటరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

ప్రజాశక్తి-గరివిడి

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటుచేసినట్లు ఎమ్మెల్యే కళావెంకటరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని మందిరివలసలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: నగరంలోని గాజులరేగ గాంధీ మండపం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహశీల్దార్ కూర్మనాధ్, నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు పాల్గొని రెవెన్యూ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రెవెన్యూ సదస్సుల ఆవశ్యకతపై తహశీల్దార్ వివరించారు. ప్రజల నుండి వచ్చిన రెవెన్యూ వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నడిపల్లి ఆదినారాయణ,కర్రోతు రాధామణి, పట్టా ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని చినగుడిపాలలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 9 అర్జీలు వచ్చాయని తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. అందులో మ్యుటేషన్లకు 8 దరఖాస్తులు అందాయని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్, విఆర్‌ఒ పాల్గొన్నారు.

మెరకముడిదాం : మండలంలోని గర్భాంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. వీటిలో అత్యధికం మ్యుటేషన్లకు సంబంధించినవే ఉన్నాయి. కార్యక్రమంలో తహశీల్దార్ అజయ్ రఫీజ్, టిడిపి మండల నాయకులు తాడ్డి శ్రీధర్, తాడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే లోకం నాగమాధవి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

ప్రజాశక్తి-డెంకాడ

ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి కోరారు. మండలంలోని గంట్లాం గ్రామంలో పశు సంవర్థక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద పశువైద్య శిబిరం, లేగ దూడల ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 51 పశువులకు చికిత్స చేసి, మందులు పంపిణీ చేశారు. లేగ దూడల ప్రదర్శనలో ఆరోగ్యంగా ఉన్న వాటికి మొదటి మూడు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, పశుసంవర్ధక శాఖ జెడి వైవి రమణ, పశు గణాభివృద్ధి సంస్థ డిడి రాధాకృష్ణ, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, మాజీ జెడ్‌పిటిసి కంది సూర్యనారాయణ, పశుసంవర్ధక శాఖ ఎడి ఉమాశంకర్ మహాపాత్రో, సర్పంచ్ రమణ రాజు, జనసేన మండల కోఆర్డినేటర పైల శంకర్, నాయకులు దిండి రామారావు, చింతపల్లి రామ్మూర్తి, పశువైద్యాధికారులు శ్రీకాంత్, రామరాజు, కమల కుమారి, సంతోష్ సాగర్ పాల్గొన్నారు.

డిజిటల్ సమ్మిట్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-భోగాపురం

మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఈ నెల 19 నుంచి నిర్వహించే డిజిటల్ సమ్మిట్ బ్రోచర్‌ను ఎమ్మెల్యే లోకం మాధవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆమెను ఆ సంస్థ సిఇఒ లోకం ప్రసాద్‌తోపాటు సిబ్బంది శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టెక్నాలజీ రంగంలో నూతన పద్ధతుల ద్వారా భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయన్నారు. సమ్మిట్‌లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు రావడంతో అనేక విషయాలను తెలుసుకునేందుకు వీలుపడుతుందని తెలిపారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలో శనివారం సాగునీటి సంఘాల ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల డిటి వివిఆర్ జగన్నాథరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో వెదుళ్ల చెరువు సాగునీటి సంఘం ఓటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికకు వంద శాతం సభ్యులు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి, ఎపిఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ప్రజారోగ్య సిబ్బంది దాడులు కొనసాగుతున్నాయి. పారిశుధ్య పర్యవేక్షకుల ఆధ్వర్యంలోని బృందాలు నగర వ్యాప్తంగా పర్యటిస్తూ దుకాణాలు, పళ్ల వ్యాపారులు, టిఫిన్ దుకాణాలు తనిఖీ చేస్తూ ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్నారు.

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

కడప జిల్లాలో సాక్షి విలేకరులపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని జర్నలిస్టుల ఐక్య వేదిక నాయకులు కె.శ్రీనివాసరావు (వాసు), వ్యాస్ బాబు, రఫీ, జగన్, కృష్ణమూర్తి, చలం, తవుడు... పోలీసులను డిమాండ్ చేశారు. సాక్షి విలేకరులపై దాడికి వ్యతిరేకంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి విలేకరులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడులను నివారించి జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మూడు ఇసుక లారీలు పట్టివేత

ప్రజాశక్తి-భోగాపురం

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒక పక్క ప్రభుత్వం హెచ్చరిస్తున్నప్పటికీ అక్రమార్కులు మాత్రం తమ పని తాము చేసుకుంటున్నారు. సరైన బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక లారీలను విజిలెన్స్ మైనింగ్ అధికారులు శుక్రవారం పట్టుకున్న వ్యవహారమే దీనికి నిదర్శనం. రీజనల్ విజిలెన్స్ మైనింగ్ ఎడి వి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వెళుతున్న ఈ లారీలను భోగాపురం జాతీయ రహదారిపై తనిఖీ చేశారు. బిల్లులు పరిశీలించగా అవి సరైనవి కాకపోవడంతో మూడు లారీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పజెప్పారు. ఈ మూడింటికి భారీ జరిమానాలు వేసే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

రైల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

టాటానగర్ నుంచి ఎర్నాకులం వెళ్తున్న రైలులో శుక్రవారం ఆచూకీ తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆయన వయసు 40 నుంచి 45ఏళ్లు ఉంటుంది. కోచ్ నెంబరు ఎస్1, బెర్త్ 32లో ప్రయాణిస్తున్న ఈయన అపస్మారక స్థితిలో ఉండడంతో గమనించి రైల్వే సిబ్బంది విజయనగరం రైల్వేస్టేషన్‌లో డ్యూటీ డాక్టర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన పరిశీలించిన ఆ వ్యక్తి చనిపోయినట్లు నిర్ధారించారు. జిఆర్‌పి ఎస్ఐ వి.బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9490617089, 0891-2883218 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

చీటీల పేరుతో మోసగించిన ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-భోగాపురం

చీటీల పేరుతో మోసం చేసిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు సిఐ ఎన్‌వి ప్రభాకర్ తెలిపారు. భీమిలి మండలం వలందపేట గ్రామానికి చెందిన సరగడ పార్వతి, లక్ష్మణ్ రెడ్డి భార్యభర్తలు. వీరిద్దరూ చీటీలు వేసి రూ.2.27 కోట్ల మేర బాధితులను మోసం చేశారు. చెరుకుపల్లికి చెందిన మజ్జి త్రినాథమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

టేకు చెట్ల మాయంపై కేసు నమోదు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని చామలాపల్లి రెవెన్యూ పరిధిలోని వెంకయ్యపాలెం వద్ద ప్రభుత్వ భూముల్లో టేకు చెట్ల మాయంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.దేవి తెలిపారు. అనుమతులు లేకుండా టేకు చెట్లు నరికివేతపై 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనంతో తహశీల్దార్ రాములమ్మ దర్యాప్తు చేశారు. అనంతరం తహశీల్దార్ ఇచ్చిన నివేదిక మేరకు కట్టా కాశీవిశ్వనాథం, కట్టా స్టార్కస్, కట్టా విజయలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ప్రకటన
మహారాజశ్రీ రాజాం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
OS 41/2023

వాది :- చొంగల కంచియ్య
VS
ప్రతివాది :- నేతల రాజబాబు

పై నెంబరు దావాను వాది ప్రతివాదిపై అస్వాధీన తనఖా పత్రం తే 08-06-2020ది యొక్క బాకీ మొత్తం రాబట్టే నిమిత్తం దాఖలు చేయడమైనది. సదరు ప్రతివాది సమన్లు అమలు నిమిత్తం Beta కట్టిన అమలు కానందున శ్రీ కోర్టువారు పేపరు పబ్లికేషన్ ద్వారా సమన్లు అమలు చేయమని ఆర్డరు జారీ చేసిరి. కావున ఈ దావాలో ప్రతివాది నేతల రాజబాబు S/o లేటు పైడినాయుడు గారు **తేది 20-12-2024దిన ఉ॥ 10-30 గంటల**కు శ్రీ రాజాం జూనియర్ సివిల్ జడ్జికోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై అతనికి గల ఆక్షేపణలు తెలియజేయగలరు. అటులు కాని యెడల మీకు వ్యతిరేకముగా తీర్పు ఇవ్వడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

నేతల రాజబాబు
S/o లేటు పైడినాయుడు
బొద్దూరు గ్రామం,
సంతకవిటి మండలం,
విజయనగరం జిల్లా.

ఇట్లు
ఐ.శ్రీరాములునాయుడు
న్యాయవాది, గాయత్రికోలనీ,
రాజాం, సెల్ : 9441289946

మహారాజశ్రీ విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ ట్రయల్ ఆఫ్ అఫెన్సెస్ ఎగెనెస్ట్ Women-cum-V Additional District Judge కోర్టు వారి దివ్యసముఖనకు
O.S. 12/2021

బిట్వీన్ :
శ్రీ పంతుల భాస్కర రామమూర్తి వగైరాలు...వాదులు.
మరియు :
శ్రీ పంతుల జానకిరామ జోగారావు (ఏలియాస్) పాలబాబి వగైరాలు ....ప్రతివాదులు.
D 21 : శ్రీమతి బండారు సూర్య పద్మావతి, వ॥ 46 సం॥లు, డోరు నం.18-5-3b, జి.కే. మేంసన్స్, పొత్తూరివారివీధి, విజయనగరం.
D 24 : శ్రీమతి పొగరు సుబ్బలక్ష్మి, వ॥ 49 సం॥లు, డోరు నం. 18-5-3/3a, జి.కె. మేంసన్స్, పొత్తూరువారి వీధి, విజయనగరం

పై నెంబర్ దావాలో షెడ్యూల్ దాఖల ఆస్తిపై యిందలి వాదులు వాటా కోరుచూ పై కోర్టులో ప్రతివాదులపై యిందలి దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు పలుమార్లు నోటీసు పంపించిననూ మీరు వాటిని తెలుసుకొని తీసుకోకుండా తప్పించికొని యుండటవలన ఈ ప్రకటన మూలముగా మీకు నోటీసు చేస్తూ మీ యొక్క హాజరు నిమిత్తం **తే: 20-12-2024దీ**న వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా దినమున పై కోర్టువారి ఎదుట **ఉదయం 10-30 ని॥**లకు మీరు స్వయముగా గాని, వకీలు ద్వారాగాని, పై కోర్టులో హాజరు కావలెను. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడును.

ఈ ప్రకటన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ప్రచురించడమైనది).

గంటి గోపాలకృష్ణ శర్మ
ప్రాతా మణికేశ్వర సాయి
వాదుల తరపున వకీలు,
బొబ్బిలి